క్లుప్తంగా

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం



చల్లపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. గురువారం స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఈఓ పేర్ని మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కలతోటి సుధాకర్, సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు ప్లాస్టిక్ బూట్లు, మాస్కులు, ఫేస్ షీల్డ్‌లు పంపిణీ చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత



మోపిదేవిలంక(మోపిదేవి): మోపిదేవిలంక గ్రామానికి చెందిన పెద్దిబోయిన కుటుంబరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలను మృతుడి భార్య నాగలక్ష్మికి గురువారం సర్పంచ్ మోర్ల జ్యోత్స్న అందజేశారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పీతా మహేష్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొరిపర్తి ధనుంజయరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక



పెడన: పెడన మండలం బల్లిపర్రు ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఇద్దరు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ గురువారం తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో విద్యార్థినులు కె. వాసంతి, సీహెచ్ శిరీష ఎంపికయ్యారని చెప్పారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయినులు పి. మాధురి, టి. ప్రశాంతిలను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

దోమల నివారణకు చర్యలు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు దగ్గర ఉండి ప్రాథమికోన్నత పాఠశాల, భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయం రహదారుల్లో సున్నం చల్లించి రహదారులను శుభ్రం చేయించారు. వాతావరణంలో మార్పుల వల్ల వచ్చే దోమలను నియంత్రించేందుకు పారిశుద్ధ్య పనులు చేపట్టి ఎబేట్ మందును స్ప్రే చేయించామని సర్పంచ్ తెలిపారు. గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మాధవేంద్రరావు పనులను పర్యవేక్షించారు.

గడప గడపకు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెం 11 వార్డులో గడప గడపకు నిధులు రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నందిగం మేరీరాణి ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి గడప గడపకు మన ప్రభుత్వం నిధులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నిధులతో 84 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులు చేపట్టామని సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్ హనుమంతు ఫణీంద్ర తెలిపారు. వార్డు సభ్యురాలు రావి సుధారాణి, నందిగం అభిషేకరావు పాల్గొన్నారు.

అడ్వయిజరీ కమిటీల నియామకం

బంటుమిల్లి: బంటుమిల్లి, ఆర్తమూరు గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లకు నూతనంగా అడ్వయిజరీ కమిటీల నియామకం జరిగింది. గురువారం బంటుమిల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బంటుమిల్లి సబ్ స్టేషన్ కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ వెలివెల చినబాబు, ఆర్తమూరు సబ్‌స్టేషన్‌కు జెడ్పీటీసీ మలిశెట్టి వెంకటరమణలను నియమించారు. మచిలీపట్నం విద్యుత్ శాఖ డీఈఈ ఎం. భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుల పేర్లను వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

పెడన: సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం పెడన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి. మహేంద్రను నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎ. గోపీచంద్, ఉపాధ్యక్షులు సాయిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రవణకుమార్, సంఘ నాయకులు శేషు, జితేంద్ర, రవి భార్గవ్, పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా

- మేయర్ వెంకటేశ్వరమ్మ
- హెడ్ వాటర్ వర్క్స్, ఓవర్ హెడ్ ట్యాంకుల పరిశీలన
- సిబ్బందికి పలు సూచనలు



రాజుపేట ఈ-సేవా కేంద్రం వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు కలుషితం లేని స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో సిబ్బంది అశ్రద్ధ చూపితే సహించేది లేదని హెచ్చరించారు. గురువారం ఉదయం నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్‌తో పాటు పలు ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద నీటి సరఫరా పరిస్థితులను ఆమె పరిశీలించారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో ఓహెచ్ఆర్‌లను పరిశీలించిన ఆమె తాగునీటి సరఫరా, క్లోరినేషన్ జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హెడ్ వాటర్ వర్క్స్‌తో పాటు రాజుపేట ఈ-సేవా కేంద్రం, దేశాయిపేట, శారదా నగర్ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేశాయిపేటలో ఓవర్ హెడ్ ట్యాంకు వద్దకు వెళ్లేందుకు కనీస మార్గం లేకపోవడంపై సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు పెద్దఎత్తున పెరిగి అస్తవ్యస్తంగా ఉన్నా చర్యలెందుకు తీసుకోవడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు.

ఓవర్ హెడ్ ట్యాంకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రాజుపేట ఈ-సేవా కేంద్రం వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద కనీసం లైట్లు లేకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. చీకటిగా ఉంటే తాగునీటి సరఫరా పనులు ఎలా నిర్వహిస్తారని, వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సుబ్బన్న, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చవితి వేడుకలు



నాగాయలంకలో సామూహిక సాయి సత్యవ్రతం పూజలు



ఖొజ్జిల్లిపేటలో బెలూన్లు, మొక్కలతో వినాయకుని అలంకారం

పెడన: వినాయక చవితి వేడుకలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ప్రధాన సెంటర్లు, వివిధ కూడళ్లలో ఏర్పాటుచేసిన పందిళ్లలో స్వామి వారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల మధ్యాహ్నం భారీ అన్న సమారాధనలు జరిగాయి. పెడన పట్టణం మఠం వీధి, బ్రహ్మపురం, 2, 7 వార్డులలో అన్నసమారాధనలు నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ఆయా వార్డులలో వినాయకుని పందిళ్లను సందర్శించి స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, పట్టణ కన్వీనర్ బండారు మల్లి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. రెండో వార్డులో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, కౌన్సిలర్ బళ్ల జ్యోత్స్నరాణి, ఫ్లోర్‌లీడర్ బళ్ల గంగయ్య, కౌన్సిలర్ మెట్ల గోపీ తదితరులు రాజీవ్‌తో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు పిచ్చిక సతీష్‌బాబు, శిరివెళ్ల జయేష్‌లు పాల్గొన్నారు. సాయంత్రం బందరు రోడ్డులోని రామరాజు చానల్‌లో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.

సామూహిక సాయి సత్య వ్రతాలు..

నాగాయలంక: నాగాయలంక వినాయక నవరాత్రి ఉత్సవాల పందిరిలో గురువారం సామూహిక సాయి సత్యవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన పీఠం వద్ద అమ్ముల నాగరాజు, నాగశ్రీ దంపతులు సాయి పూజ జరిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు సామూహిక సాయి సత్య వ్రతంలో పాల్గొన్నారు. నిత్య కార్యక్రమా ల్లో భాగంగా అంబా సాయికిరణ్‌శర్మ (కౌశిక్) బ్రహ్మత్వంలో యల్లంపల్లి కల్యాణ్, రజని దంపతులచే తౌలుత ప్రసన్న గణపతి ఆలయంలో, అనంతరం ఉత్సవ విగ్రహ వేదికపై పూజలు జరిగాయి. భోగాది శేషాద్రి ఆర్థిక సౌజన్యంతో పాల రామాంజనేయులు భాగవతార్‌చే హరికథా గానం జరిగింది.

గణనాథుని గ్రామోత్సవం

మోపిదేవి: వినాయక చవితి సందర్భంగా రావివారిపాలెం కోదండరామాలయం వద్ద నెలకొల్పిన గణేశుని విగ్రహాన్ని కృష్ణానదిలో నిమజ్జనానికి గురువారం సాయంత్రం తరలించారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో మేళతాళాలు, డప్పుకళాకారుల సందడితో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దారిపొడవునా మహిళలు హారతులు అందించి గణేశుని విగ్రహాన్ని సమీపంలోని మోపిదేవివార్పు వద్ద కృష్ణానదికి సాగనంపారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాలుగు రోజులుగా వినాయక చవితి వేడుకలు కొనసాగుతున్నాయి. పలువురు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారికి తీర్థ ప్రసాదాలను సమర్పించారు. బంటుమిల్లి రాజీవ్ నగర్, నాగేశ్వరరావుపేట తదితర గ్రామాల్లో ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని బొజ్జగణపయ్యను ట్రాక్టర్లపై ఉంచి మేళతాళాలు, కనకతప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

లంబోదరుడికి పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన చవితి పందిళ్ల వద్ద వివిధ ఆకారాల్లో నెలకొల్పిన గణనాథుని విగ్రహాలకు ఉదయం, సాయంత్రం పూజలు చేశారు. ఈ సందర్భంగా వినాయకుడి అలంకరణలు ఆకట్టుకున్నాయి. అలంకారాలు తిలకించేందుకు భక్తులు చవితి పందిళ్లకు విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోడూరు: స్థానిక అయ్యప్ప స్వామి వారి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని గురువారం కోడూరు వీధులు వెంట ఊరేగించారు. గణనాథుడికి పూజల అనంతరం ప్రత్యేక వాహనంపై డప్పువాయిద్యాల మధ్య ఊరేగిస్తూ నిమజ్జనానికి తీసుకువెళ్లారు. ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో గణనాథుడి నిమజ్జనాన్ని నిర్వహించారు. లింగారెడ్డిపాలెం, ఉల్లిపాలెం, నక్కవానిదారి, విశ్వనాథపల్లి, కోడూరు తూర్పు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల వద్ద నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.





పెడన ఏడో వార్డులో అన్నసమారాధన : నిమజ్జనానికి తరలివెళుతున్న నాగేశ్వరరావుపేట గణనాథుడు



మోపిదేవిలో ట్రాక్టర్‌పై వెళుతున్న గణేశుడు

బిషప్ గాడెల్లి పరిశుద్ధబాబుకు నివాళి



గాడెల్లి పరిశుద్ధ బాబు (ఫైల్)

మచిలీపట్నంటౌన్: ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ బిషప్ గాడెల్లి పరిశుద్ధబాబు (74) బుధవారం రాత్రి మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ కొన్ని రోజులుగా విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని బుధవారం రాత్రి విజయవాడ నుంచి మచిలీపట్నంలోని లక్ష్మణరావుపురంలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫెయిత్ టెంపుల్ చర్చిలను, సంఘ కాపరులను ఏర్పాటు చేసి దేవుని సువార్త నలుదిక్కులా వ్యాప్తి చేసేందుకు కృషి చేశారు. పలు అనాథ ఆశ్రమాలను, పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యాదానం చేస్తున్నారు. పరిశుద్ధబాబు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మొదటి అదనపు జిల్లా కోర్టు స్పెషల్ పీపీ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. పరిశుద్ధబాబు అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు లక్ష్మణరావుపురం నుంచి ప్రారంభమవుతుందని ఆయన తనయుడు, మాజీ కౌన్సిలర్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్ తెలిపారు. కొత్తపూడి గ్రామం వద్ద ఉన్న చర్చి ఆవరణలో ఆయన కోరిక మేరకు మట్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

సోషల్ మీడియా యాప్‌లపై అవగాహన

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు సోషల్ మీడియాను సక్రమంగా వినియోగించుకోవాలని ఇనుగుదురుపేట సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. గొడుగుపేట లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో గురువారం సోషల్ మీడియా యాప్‌లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సాంఘిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పెట్టరాదన్నారు. డబ్బులు ఇస్తామంటూ వచ్చే లింక్‌లను నొక్కవద్దని చెప్పారు. వాటి వల్ల అకౌంట్‌లోకి డబ్బులు వేయడం కాకుండా దొంగిలిస్తారన్నారు. తెలియని లింకులను క్లిక్ చేసి ప్రతిరోజూ చాలా మంది ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. విద్యార్థులు వీలైనంత వరకు సోషల్ మీడియా యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా, స్కూల్ నిర్వాహకులు వి. నవీన్, శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. రుద్రవరం గ్రామంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడే తత్వం కలిగి ఉండాలన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాన్ని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుకోవాలని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలలు ఏమాత్రం తీసిపోవని చెప్పారు. న్యాయవాది అజ్మతున్నీసా మాట్లాడుతూ విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జాన్ కెనడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులు, పందులు రోడ్లపై సంచరిస్తే కఠిన చర్యలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో రహదారులపై ఆవులు, గేదెలు, పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ వాహన చోదకులకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయని కమిషనర్ జి. చంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులు, పందులు ఇకపై రోడ్లపై సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటి యజమానులు నివాసాలకు దూరంగా ఉన్న వారి సొంత స్థలాల్లో వీటిని ఉంచుకోవాలని సూచించారు. లేకుంటే పోలీసుల సహకారంతో పశువులు, పందులను స్వాధీనం చేసుకుని సుదూర ప్రాంతాలకు తరలిస్తామని హెచ్చరించారు. ఒక్కొక్క పశువు, పందికి రూ. 2 వేలు అపరాధ రుసుం యజమాని నుంచి వసూలు చేస్తామని, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

రేపు ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఆటల పోటీలు

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్రశిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు శనివారం ఆటల పోటీలు నిర్వహిస్తామని సమగ్ర శిక్షా ఇన్‌చార్జి ఏపీసీ ఎం. ఫణిధూర్జటి గురువారం తెలిపారు. మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆటల పోటీలు జరుగుతాయని చెప్పారు. ఆయా మండలాలకు చెందిన ఎంఈఓలు పోటీల్లో పాల్గొనే పిల్లలను శనివారం ఉదయం 9 గంటలకు గ్రౌండ్‌కు తీసుకురావాలని ఆయన సూచించారు.

నేడు మల్లవోలులో కబడ్డీ పోటీలు

గూడూరు: వైఎస్సార్ సీపీ ఆధర్వంలో బందరు డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో నిర్వహిస్తామని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వర్ణం మహాలక్ష్మయ్య నాయుడు తెలిపారు. అండర్-17 స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలను ఉదయం 10 గంటలకు మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ప్రారంభిస్తారని చెప్పారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

చల్లపల్లి: వాసవీ క్లబ్ చల్లపల్లి శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మోహనరావు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 60 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామని క్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు తెలిపారు.

పౌష్టికాహారం సద్వినియోగం కావాలి

ఐసీడీఎస్ ఆర్జేడీ ఉమాదేవి



మాట్లాడుతున్న ఆర్జేడీ ఉమాదేవి

బంటుమిల్లి: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం అయ్యేలా అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలని సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ (ఐసీడీఎస్) శాఖ ప్రాంతీయ (ఆర్జేడీ) సంచాలకురాలు ఉమాదేవి అన్నారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సకాలంలో గర్భిణులు, బాలింతలు వినియోగించుకునేలా కార్యకర్తల పర్యవేక్షణ ఉండాలన్నారు. సీడీపీఓ సముద్రవేణి మాట్లాడుతూ పౌష్టికాహార వారోత్సవాలు, తల్లిపాల వారోత్సవాలు తదితర కార్యక్రమాలు తల్లీబిడ్డల క్షేమం కోసమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ వి. చినబాబు మాట్లాడుతూ పౌష్టికాహారం వినియోగించుకున్నప్పుడే ప్రభుత్వ పథకాల ఉద్దేశం నెరవేరుతుందన్నారు. ఎంపీడీఓ స్వర్ణభారతి, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఎంపీటీసీ కమాల్‌పాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్. మహేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అత్యాధునిక వైద్య సేవలే లక్ష్యం

గూడూరు ఎంపీపీ మధుసూదనరావు



మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: నిరుపేదలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మంత్రి జోగి రమేష్ ప్రత్యేక చొరవతో రూ.4 కోట్లతో ఆస్పత్రిని అన్ని వసతులతో పూర్తి స్థాయి 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి గూడూరు ఆస్పత్రికి రోగులు వస్తున్నారంటే ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలే కారణమన్నారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని ఆయన కోరారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు మాట్లాడుతూ మంత్రి జోగి రమేష్, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవతోనే ఆస్పత్రికి మహర్దశ కలిగిందన్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశారని చెప్పారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. వైద్యాధికారి నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎంఏ సలీం, పీఏసీఎస్ డైరెక్టర్ ఆకూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరరావు, వైద్యులు హరిరంగప్రసాద్, అరుణ కాత్యాయని, భాస్కర్, అజిత పాల్గొన్నారు.

'జగనన్న చేదోడు' వ్యాపారాల పరిశీలన



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఈడీ శ్రీనివాసరావు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలో గురువారం జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలను బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు పరిశీలించారు. నగరంలోని బుట్టాయిపేట, చెమ్మనగిరిపేట, గిలకలదిండి, నారాయణపురం ప్రాంతాల్లోని సచివాలయ పరిధిలోని లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలను పరిశీలించి వారి వ్యాపారాభివృద్ధికి తగిన సూచనలు చేశారు.

చేదోడు పథకాన్ని ఇంకా ఎవరైనా అర్హులైన వారు ఉంటే వలంటీర్ ద్వారా సచివాలయంలో సంక్షేమ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని, పారదర్శకంగా వారిని ఎంపిక చేస్తామని చెప్పారు. రూ. 10 వేలు ఆర్థిక సహాయం వృత్తిదారులకు అందజేస్తామని తెలిపారు. టైలర్స్, రజకులు, నాయీ బ్రాహ్మణులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చునన్నారు.

మండలంలో కొత్త పెన్షన్ల పంపిణీ



పెన్షన్ అందజేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. మండల పరిధిలోని గుండుపాలెం, చిన్నాపురం, నెలకుర్రు గ్రామాల్లో గురువారం కొత్త పెన్షన్లను ఆయన లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలన్నీ పేదల కోసమేనన్నారు. మండలంలో కొత్తగా పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా అందుతున్న సహాయ సహకారాలను మరువకూడదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు అండగా నిలబడి మరో మారు వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ ఇన్‌చార్జ్‌లు, గ్రామ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు చల్లపల్లి విద్యార్థిని ఎంపిక

చల్లపల్లి: కృష్ణా జిల్లా వాలీబాల్ జట్టుకు చల్లపల్లి క్రీడాకారిణి ఎంపికైంది. స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కుంచె దివ్య వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. తద్వారా అనంతపురంలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ వాలీబాల్ పోటీలకు కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించేందుకు ఎంపికైంది. ప్రతిభ కనబర్చిన దివ్యను హైస్కూల్ ఇంచార్జి సుదర్శన్, పీఈటీ శ్రీనివాసరావు, రేణు ప్రసాద్ అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ మచిలీపట్నం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డిపో మేనేజర్ టి. పెద్దిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు సలహాలు, సూచనలు, సమస్యలను 9959 225462 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.